క్లుప్తంగా

వారాహిదేవి అలంకరణలో అమ్మవారు



మధిర: ఆషాఢ మాసం సందర్భంగా మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మూడు రోజులు పాటు ఉత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం అమ్మవారిని వారాహిదేవిగా అలంకరించగా భక్తులు దర్శనం చేసుకున్నారు. అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థి ప్రతిభ



ఓంకార్ రెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధిర: నిదానపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వట్టివేళ్ల ఓంకార్ రెడ్డి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థి ఓంకార్ రెడ్డితో పాటు తల్లిదండ్రులు విజయలక్ష్మి, కృష్ణారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థిని అభినందించిన వారిలో గ్రామ సర్పంచ్ బాదా కృష్ణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, సత్యావతి, రంగారావు, విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, కృష్ణయ్య, హైమావతి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

సత్తుపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్లలో స్థానికులను కలుసుకొని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. ఆయన వెంట దొడ్డా శ్రీనివాసరావు, ఎండి కమల్‌పాషా, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, ఇమ్మినేని ప్రసాద్, అలవాల కరుణాకర్, షేక్ రఫీ, యూనీస్, రాకేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మాధవరావు సేవలు మరువలేనివి

మధిర: సీపీఐ అభివృద్ధి కోసం కర్నాటి మాధవ రావు అందించిన సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. కృష్ణాపురం గ్రామంలో శనివారం మాధవరావు సంస్మరణ సభ జరిగింది. మాధవరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి వూట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, బెజవాడ రవిబాబు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కల్లూరు: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకున్న వారు ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రూప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15, 2023 వరకు పట్టాదారు పాసు పుస్తకం కొత్తగా తీసుకున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 1964 ఆగస్టు 14 నుంచి 2005 ఆగస్టు 14 వరకు జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్, నామిని ఆధార్ జిరాక్స్ కాపీలతో ఏఈఓ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

బోనకల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు చేపట్టాలని యూటీఎఫ్ మండల కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 19న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా శనివారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోపాల్‌రావు, జ్ఞానేశ్వరాచారి, రామారావు, నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లు నిర్మించాలని ఆందోళన

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని పాలవాడలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఆందోళనకు దిగా రు. 20 రోజుల క్రితం డ్రెయినేజీ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ కాలువలు తీయించారు. శనివారం ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి పూడ్చుతుండటంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో అజయ్, నర్సింహ, హనుమంతరావు, రఘు పాల్గొన్నారు.

గోరింటా పూసింది..



గోరింటాకు చేతులతో మహిళలు



ఎర్రగా పండిన చేతులతో..

- ఆషాఢంలో మహిళల సందడి..
- అందం, ఆరోగ్యం..
- ఎరుపెక్కిన చేతులతో మురిసిపోతూ..

సండే స్పెషల్

సత్తుపల్లి టౌన్: మహిళలకు గోరింటాకు పెట్టుకోవడం అంటే మహాఇష్టం. ఇక ఆషాఢమాసంలో అయితే అరచేతులు మరింత ఎర్రగా పండుతాయని.. ఎంతో శుభప్రదమని సంప్రదాయంగా ఆసక్తి చూపుతారు. పుట్టింటికి వచ్చిన కొత్త పెళ్లి కూతుళ్లు ఆచరిస్తే.. ఆ ఇంట ఆనందాలు వెల్లివిరుస్తాయని, యువతులకైతే మంచి మొగుడు వస్తాడని పెద్దలు చెపుతుంటారు. ఆషాఢమాసంలో యువతులంతా ఆశించే సౌభాగ్యమిది. గోరింటాకును స్నేహితులు, ఇరుగు పొరుగువారితో కలిసి పెట్టుకొని ఎరుపెక్కిన చేతులను చూసి మహిళలు మురిసిపోతుంటారు. ఇంటిల్లిపాది ఒకరిచేతికి ఒకరు ముద్దలుగాచేసి అరచేతులు, చేతివేళ్లకు కాళ్లకు పెట్టుకోవడం ఆనవాయితీ. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ల పరిసరాలలో ఉంటే గోరింటాకు చెట్ల నుంచి పోటీపడి మరీ గోరింటాకు కోసి పెట్టుకుంటారు.

గోరింటాకు తయారీ ఇలా..

గోరింటాకు చెట్ల నుంచి ఆకులను కోసుకొచ్చి మెత్తగా రుబ్బుతారు. ఇందులో కొంచెం చింతపండు, కొద్దిగ మజ్జిగ, నిమ్మ చుక్కలు వేసి రోట్లో రుబ్బుతారు. మెదిగిన గోరింటను చేతులు, కాళ్ల పాదాలపై పెట్టుకుంటారు. ఎర్రగా పండిన చేతులు కొత్త శోభను పులుముకుంటే చూసుకొని ఆనందంతో పులకించి పోతారు.

ఔషధంలా...

గోరింటాకు అలంకరణకే కాకుండా ఔషధ గుణాలు కలిగి ఉంటుందని ఆయుర్వేద వైద్యులు అంటున్నారు. అరికాళ్లకు పెట్టుకుంటే శరీరంలోని వేడిని, మంటలను తగ్గిస్తుంది. గాయాలైన చోట రాసుకుంటే త్వరగా మానిపోతాయి. గోరింటాకు పెట్టుకుంటే నీళ్లల్లో, పొలంలో పని చేసే పాదాలు, చేతులు దెబ్బతినకుండా ఉంటాయని ప్రజల నమ్మకం. చర్మంపై వచ్చే మంటలను చల్లబరుస్తుంది. కొన్ని రకాల చర్మవ్యాధులు, చుండ్రును తగ్గిస్తుంది. వెంట్రుకలు రాలటం ఆపి కేశాలంకరణలో ఈ గోరింట ఉపయోగపడుతుంది.

శుభప్రదంగా..



గోరింటాకు పెట్టుకోవడం మహిళలు శుభప్రదంగా భావిస్తారు. వర్షాకాలంలో గృహిణిలకు నీటిలో తడవటం వల్ల కాళ్లు, చేతులకు వచ్చే చర్మ వ్యాధులకు యాంటీబయాటిక్‌గా గోరింటాకు పని చేస్తుంది. అన్ని విధాల మంచిదని ఇష్టపడతారు. రోగ నిరోధకంగా కూడా పని చేస్తుంది.

– సీహెచ్.శ్రీవైష్ణవి, సత్తుపల్లి

పండుగలా పెట్టుకుంటాం..



ఆషాడమాసంలో గోరింటాకు స్నేహితులందరం కలిసి ఒకే చోటుకు చేరి పండుగలా పెట్టుకుంటాం. ఎర్రగా పండేవరకు ఎంతసేపటి వరకై నా వేచి చూస్తాం. చేతికి అందంతో పాటు ఆరోగ్యమని పెద్దలు చెపుతుంటారు. సాంప్రదాయంగా తప్పనిసరిగా గోరింటాకు పెట్టుకుంటాం.

– గంధ్ర జయరెడ్డి, సత్తుపల్లి

సంస్కృతికి ప్రతీక..



ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం పూర్వం నుంచి వస్తున్న తెలుగు సంస్కృతి సాంప్రదాయంగా భావిస్తాం. గోరింటాకు పెట్టుకుంటే అందం, ఆరోగ్యం కూడా. ఐదోతనానికి బలమని నమ్మకం. ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో స్నేహితులతో కలిసి పెట్టుకోవటం ఎంతో ఇష్టం.

– రోజారాణి, సత్తుపల్లి

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

కొణిజర్ల: జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం అన్నారు. మండలంని తీగలబంజరలో శనివారం సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులను ప్రారంభించారు. మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణ తరగతులలో వారు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు ఒక్కటీ లేక పోవడం శోచనీయం అన్నారు. ఖమ్మం జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా మిర్చి, పత్తి సాగు చేస్తున్నారని, కావున ఈ పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా రైతులకు, యువతకు అవకాశాలు కల్పించి అభివృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో మల్లెంపాటి వీరభద్రరావు, చింతపల్లి ప్రసాద్, బోయినపల్లి శ్రీనివాసరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, కట్టా రాంబాబు, మహబూబ్ అలీ, చెన్నారావు, కృష్ణార్జునరావు, హరిచంద్, వెంకయ్య, రాములు, మాధవరెడ్డి, వీరభద్రం, సాంబయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీలో రక్షణపై అవగాహన



మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సింగరేణి జనరల్ మేనేజర్ కె.గురవయ్య ఆదేశాలతో కొత్తగూడెం ఏరియా రక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పిస్తూ మోటార్‌సైకిల్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఉద్యోగులు పని ప్రదేశాల్లో తప్పని సరిగా రక్షణ విధానాలు పాటిస్తూ.. బూట్లు, హెల్మెట్ ధరించి ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ మేనేజర్ పి.నర్సింహారావు, వీరయ్య, రక్షణ అధికారి రామదాస్, సంక్షేమ అధికారి కె.దేవదాస్, పిట్ సెక్రటరీ ఉపేంద్రాచారి, చెన్నకేశవరావు, అఖీల్, సురేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి



మాట్లాడుతున్న ఏఆర్ఓ దొడ్డారపు సైదులు

వైరా: సార్వత్రిక ఎన్నికల ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కొణిజర్ల తహసీల్దార్, వైరా నియోజకవర్గ ఏఆర్ఓ దొడ్డారపు సైదులు అన్నారు. శనివారం వైరా రైతు వేదిక భవనంలో నియోజకవర్గ స్థాయి అఖిల పక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులు అభ్యంతరాలను తెలియజేయాలని, ఈ నెల 28 వరకు సూచనలు చేయాలన్నారు. ఈ నెల 20 నుంచి నెలరోజుల పాటు మోడల్ ఈవీఎం, వీవీ పాట్లు పబ్లిక్ ప్లేసుల లో ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైరా తహసీల్దార్ జగదీష్ ప్రసాద్, ఆయా మండలాల తహసీల్దార్లు, వివిధ రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు శనివారం ఉపసర్పంచ్ ఏగోటి పెద్దిరాజు శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ విడుదల చేసిన నిధులను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహకారంతో గ్రామంలోని పాదిలి రాధాకృష్ణ ఇంటి నుంచి రంగు వెంకటాచారి ఇంటి వరకు 500 మీటర్ల పొడవున సీసీరోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు(నాగయ్య), వార్డు సభ్యుడు వెంకటేశ్వరరావు, నాయకులు సత్యం, రమేష్, నాగార్జున వెంకటాచారి, నర్సింహారావు పాల్గొన్నారు.

మామునూరు గ్రామంలో..

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామంలో ఎస్డీఎఫ్ కింద మంజూరైన రూ.10 లక్షల నిధులతో నిర్మించతల పెట్టిన సీసీ రోడ్డుకు శనివారం స్థానిక సర్పంచ్ మారాబత్తుల మోహన్‌రావు శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారపు రాధిక, వార్డు మెంబర్లు వేల్పుల వాసుబాబు, మల్లారపు భూలక్ష్మి, కోట సురేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అందించాలి



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలని ఖమ్మం సువిధ వికాస్ ట్రస్ట్ నిర్వాహకుడు అమరనేని మన్మధరావు తెలిపారు. మండలంలోని మత్కేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అమెరికాలోని సువిధ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సభ్యులు అందజేసిన స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను మన్మధరావు శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులకు సహాయం చేసిన ట్రస్ట్ నిర్వాహకులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కొండలరావు, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, అంజయ్య, ఎస్ఎంసీ చైర్మన్ బాలకృష్ణ, సువిధ వికాస్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వి.రవికుమార్, జాగృతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రేజర్లలో ఉచిత వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత గ్రామమైన రేజర్లలో శనివారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, జేవీఆర్ ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి ఆదేశాలతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో జేవీఆర్ ఓసీ డిస్పెన్సరీ వైద్యుడు డాక్టర్ నర్సింహారావు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, డాక్టర్ అనుదీప్, సంక్షేమ అధికారి దేవదాస్, జేవీఆర్‌ఓసీ డిస్పెన్సరీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన వేడుకలు

ఎర్రుపాలెం: మండలంలోని రాజుల దేవర పాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పలువురి చిన్నారులకు అన్నప్రాసన వేడుకలను నిర్వహించారు. చిన్నారులకు స్థానిక సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నప్రాసన చేశారు. చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు డి.నాగమణి, జి.విజయలక్ష్మి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, నాగమణి, వెంకట్ నారాయణ, ఉషారాణి ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి

ఏన్కూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ కోరారు. మండల కేంద్రంలోని 4 మిని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఉన్న ఆహార నిల్వలను, చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గుడ్డు, పాలు, ఆకుకూరల్లో పోషకాలు ఉంటాయని వీటిని చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికార ప్రతినిధిగా రంగారావు

కల్లూరు: తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ అధికార ప్రతినిధిగా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన కాకర్ల రంగారావును నియమించారు. ఈ నియామక పత్రాన్ని శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అందించారు. ఈ సందర్భంగా రంగారావును టీడీపీ మండల అధ్యక్షుడు బానోత్ చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ పోర్లు శ్రీనివాసరావు, కట్టా గోపాలరావులు అభినందించారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ఉన్నత ఎంసెట్, జేఈఈ మెయిన్స్, నీట్ పరీక్షల్లో సత్తా చాటి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. స్థానిక శ్రీనారాయణ జూనియర్ కళాశాలలో శనివారం ఎంసెట్ కోచింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మహేష్‌ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్ సీహెచ్ రామకృష్ణమాచార్యులు, కళాశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనకల్‌లో సంత నిర్వహణకు పరిశీలన



కోదాడలో సంతను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, అధికారులు

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బోనకల్ సబ్ యార్డులో మేకలు, పశువుల సంత నిర్వహణ కోసం మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావుతో పాటు అధికారులు వివిధ ప్రాంతాల్లో ఉన్న సంతలను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, చిల్లకల్లు, నల్గొండ జిల్లా కోదాడ సంతలను శనివారం ఏఎంసీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జి.సత్యనారాయణ తదితరులు సందర్శించారు. సంతల నిర్వహణ, వసరుల ఏర్పాటు చేయడంపై విశ్లేషణ, మార్కెట్ ఆదాయం కోసం రైతులు, వ్యాపారస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా మార్కెట్లలోని అధికారులను కలిసి వివరాలు సేకరించారు. మధిర ప్రాంతంలో కూడా సంతను ఏర్పాటు చేస్తే రైతులకు, జీవాల పెంపకందారులకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎఎంసీ చైర్మన్ తెలిపారు. దీనికోసం చుట్టుపక్కల ఉన్న సంతలను పరిశీలించడం జరిగిందని, బోనకల్‌లో ఈ సంతను ఏర్పాటు చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ సూపర్‌వైజర్ జగదీష్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న డాక్టర్ అవినాష్

సత్తుపల్లిరూరల్/చింతకాని: నులిపురుగుల నివారణకు కృషి చేయాలని డాక్టర్లు అవినాష్, తోళ్ల వెంకటేశ్వర్లు అన్నారు. గంగారం, చింతకాని గ్రామాల్లోని పీహెచ్‌సీలలో వైద్య సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం, ఆగస్టు 7నుంచి నిర్వహించే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. నులి పురుగులను నివారించేందుకు 1 నుంచి 19 సంవత్సరాల పిల్లల వరకు నులి పురుగుల నివారణ మాత్రలను మింగించాలని తెలిపారు. ఈ సమావేశాలల్లో సూపర్‌వైజర్లు నర్సింహారావు, అన్నమ్మ, ప్రమీలారాణి, కృష్ణారావు, రేఖల్‌రాణి, పండరీబాయి, ఏఎన్ఎంలు పద్మ, లక్ష్మి, నాగమణి, సుజాత, రత్నకుమారి, సావిత్రి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో జన ఆరోగ్య సమావేశం..

బోనకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ.. ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, స్టేషనరీ తదితర అంశాలకు సంబంధించి చర్చించారు. సీజనల్ వ్యాధులు, నులిపురుగుల నివారణ మందులు, బోదకాలు రాకుండా మాత్రలు వేసే ప్రోగ్రాం తదితర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, తహసీల్దార్ రమణి, ఏసీడీపీఓ వీరభద్రమ్మ, ఏపీఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు సరికాదు



మాట్లాడుతున్న మానవతారాయ్

సత్తుపల్లి: కాంగ్రెస్ పార్టీలో చేరాక ప్రభుత్వం పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన అనుచరులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొటూరి మానవతారాయ్ అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం అర్బన్ మండలంలోని సర్వే నంబర్ 140లో ఉన్న భూమి విషయంలో నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు చీటికి మాటికి వేధిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. వాట్సాప్‌లో పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డికి అధికారులు రాత్రి పదిగంటలకు నోటీసులు పంపి ధృవపత్రాలతో ఉదయం 9లోపు హాజరుకావాలనడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని అభివర్ణించారు. ఇకనైనా ప్రభుత్వం కక్ష్య సాధింపుచర్యలు మానుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణ, బాబా, కాంతారావు, ఏడుకొండలు, ఖలీల్, బాజీ, యూసఫ్, యాకోబ్, అభినాష్, కార్తీక్ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తాం..

వేంసూరు: సత్తుపల్లి నియోజకవర్గంలో థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరు మానవతారాయ్ అన్నారు. శనివారం మండలంలోని చౌడవరం తండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, విజయ్‌బాబు, నాగులు, సత్యనారాయణరెడ్డి, రాదకృష్ణ పాల్గొన్నారు.

పొంగులేటి నియామకంపై హర్షం



వైరా: సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

సత్తుపల్లి/మధిర/వైరా/కొణిజర్ల: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమించడంతో ఆయా మండలాల్లోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. శనివారం సత్తుపల్లిలోని కొండూరు సుధాకర్ క్యాంప్ కార్యాలయంలో, మధిరలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకుడు కోటా రాంబాబు ఆధ్వర్యంలో, వైరా పట్టణంలో, కొణిజర్ల కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో మందపాటి ముత్తారెడ్డి, మలిరెడ్డి పూర్ణ చంద్రారెడ్డి, అప్పారావు, తోట సుజలారాణి, గణేష్, కృష్ణారెడ్డి, వినయ్‌బాబు, రవి, కోటేశ్వరరావు, నాని, ప్రసాద్, గోవర్ధన్, వీరస్వామి, రాజేష్, విజయ్‌కుమారు, మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిషోర్, వెంకటరమణ గుప్తా, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, నాగి, రాజశేఖర్, చేపల సొసైటీ అధ్యక్షుడు రహీమ్, పణితి సైదులు, మధు, రమేష్, రామారావు, రామకృష్ణ, మోహన రెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఇంకుడు గుంత నిర్మాణ పనులు పరిశీలన

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం, పమ్మి, మేడేపల్లిలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పమ్మిలో జరుగుతున్న ఇంకుడుగుంతల నిర్మాణ పనులను ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సూర్యనారాయణలు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ సువార్త, పంచాయతీ కార్యదర్శి మణి పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆపార్టీ ఏపీ రాష్ట్రం మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అక్కల గాంధీ, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ డేవిడ్, మండల కమిటీ అధ్యక్షుడు మిర్యాల నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల రామారావు, వేమా ఏడుకొండలు ఉన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

పెనుబల్లి: మండలంలోని తాళ్లపెంట గ్రామంలోని ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలంటూ శనివారం తహసీల్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గత ఇరవై సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న మాకు 2021లో ప్రభుత్వం దరఖాస్తులను కోరడంతో మేమంతా దరఖాస్తు చేసుకున్నామన్నారు. 2022లో అబద్ధపు సర్వే చేపట్టిందన్నారు. జూన్‌లో ప్రభుత్వం మండలంలోని పలు గ్రామాలకు పోడు పట్టాలు ఇచ్చి తాళ్లపెంట ఆదివాసీలను ఎందుకు మరచిందన్నారు. తమకు వెంటనే పట్టాలు ఇవ్వాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చింతకాని: ఒడిస్సా నుంచి చింతకానికి పనికి వచ్చిన రుధన్ సింగ్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై పాదిల వెంకన్న కేసు నమోదు చేసుకొని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి సదరు వ్యక్తికి శనివారం అందించాడు.

బోనాల సంబురాలు



సత్తుపల్లిటౌన్: బోనాలతో మైసమ్మకు పూజలు చేస్తున్న విద్యార్థినులు

మధిర/సత్తుపల్లిటౌన్: మధిర పట్టణంలోని జీవీ అకాడమీ ఆధ్వర్యంలో మిలీనియం పాఠశాలలో, సత్తుపల్లిలోని నారాయణ పాఠశాలలో శనివారం బోనాల సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతురాజు, అమ్మవారి వేషధారణలు ధరించి మహంకాళి అమ్మవారి బోనాన్ని ఎత్తుకున్నారు. మధిరలో నిర్వహించిన కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటుగా బ్రాంచ్ హెడ్ ఎస్.రాజేశ్వరి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి బోనం నిలువెత్తు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం వేణుగోపాల్ రావు, స్వాతి, వినోద, సరిత, సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మధిర: వివిధ రకాల వేషధారణలలో విద్యార్థులు